క్లుప్తంగా

కబీర్‌దాస్‌కు ఘన నివాళి



జడ్చర్లటౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రముఖ హిందీ కవి మధ్యయుగ సంఘ సంస్కర్త కబీర్‌దాస్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సుకన్య కబీర్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబీర్‌దాస్ గొప్ప సామాజిక స్పృహ కల్గిన కవిగా అభిప్రాయపడ్డారు. హిందీ విభాగం అధ్యక్షుడు డా.నరసింహ్మారావు కల్యాణి కబీర్‌దాస్ రాసిన బీజక్ గ్రంథంలోని విశేషాలను తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. నర్మదాదేవి, అధ్యాపకులు రాఘవేందర్‌రెడ్డి, డా.శ్రీనివాసులు, డా.నర్సింహులు, డా.వెంకటయ్య, డా.పుష్పలత, డా.నందకిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీకంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వర సేవా మండలి అధ్యక్ష, కార్యదర్శులు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, గొండ్యాల రాఘవేంద్రశర్మ తెలిపారు. ఆలయం ఆవరణలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. 21న గజవాహన సేవ, 22న హనుమత్ వాహనం, 23న గరుడ వాహనం, 24న శేష వాహనం, 25న మయూర వాహనం, 26న హంస వాహనం, 27న సింహవాహనం సేవ, 28న సుదర్శన హోమం, శాంతి కల్యాణం, 29న రథోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సి.రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయులు, నందకిషోర్, ఆకుతోట సత్యనారాయణ, కొకుంట్ల లక్ష్మయ్య, రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో పింఛన్ల పంపిణీ

నవాబుపేట: మండల కేంద్రంలో వృద్ధులు, వికలాంగులకు తన సొంత డబ్బులతో పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి 217 మందికి తన సొంత డబ్బులతో పింఛన్లు అందించారు. గతేడాది నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం సొంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థి అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో విద్యార్థి కుర్మయ్య అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్సమ్మ, నారాయణ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో కుర్మయ్య ఫెయిల్ కావడంతో కొన్ని రోజులుగా తల్లిదండ్రులతో చెప్పుకొని బాధపడేవాడు. ఈ నెల 8న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. గ్రామంలోను, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన కొత్తకాపు రఘునాథ్‌రెడ్డి కనిపించడం లేదని భార్య దివ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 7న ఎవరికీ చెప్పకుండా రఘునాథ్‌రెడ్డి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకలేదు. దీంతో ఆయన భార్య ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన వేసవి కరాటే శిక్షణ శిబిరం



మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆద్వర్యంలో ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో బుధవారం వేసవి కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకోవాలన్నారు.అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వెంకటేశ్, బాసిత్, శ్రీనివాస్, కె.నర్సింహులు, మహేందర్, బుచ్చన్న, వెంకటేశ్, సంపత్‌కుమార్, పాల్గొన్నారు.



కొకుంట్లలో ఏరువాక తాడును తెంచడానికి పరుగులు తీస్తున్న ఎడ్లబండ్లు, హాజరైన ప్రజలు



కొకుంట్లలో ఎడ్లబండ్లకు పూజలు చేసి పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు



పగిడ్యాల్‌లో గొర్రె పొట్టేళ్లతో బండి ఊరేగింపు

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

- పరుగులు తీసిన ఎడ్ల బండ్లు
- ఉత్కంఠగా సాగిన తోరణం తెంపే వేడుక



దేవరకద్రలో పరుగు తీస్తున్న ఎడ్ల బండ్లు

దేవరకద్ర: కొకుంట్ల మండల కేంద్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసి ఏరువాక తాడు తెంపే వేడుకలు ఆహ్లాదకరంగా, ఆనందోత్సాహాల మధ్య కొనసాగించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏరువాక తాడును బిగించి గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్లబండ్లు పరుగులు తీసే పోటీలు ప్రారంభించారు. గ్రామానికి చెందిన యువ రైతులు 25 ఎండ్ల బండ్లను పరుగులు తీయించారు. ప్రత్యేకంగా అలంకరించి ఎడ్ల బండ్లు ఏరువాక తాడు ఏర్పాటు చేసిన రహదారిపై పరుగులు తీస్తున్న వేడుకను చూసి వేలాదిగా మహిళలు, పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. బస్టాండ్ ప్రాంతమంతా ప్రజలతో నిండిపోగా తాడును తెంచే వేడుక ఉత్కంఠంగా సాగింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ వేడుకలు అందరిని అలరించాయి. పరుగులు తీస్తున్న బండిపై నుంచి చెర్లకోలతో ఏరువాక తాడును తెంచాలి, గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను ఏరువాక తాడును తెంచి విజేతగా నిలిచాడు. ఏరువాక వేడుకలో పాల్గొన్న అన్ని ఎడ్ల బండ్లకు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కిషన్‌రావు మువ్వలను అందజేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షులు కేబీఆర్‌గౌడ్ ఎడ్ల బండ్ల రైతులకు శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు.

❖ దేవరకద్ర మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు రైతులు ఎడ్లబండ్లను పరుగులు తీయిస్తూ ఏరువాక తాడును తెంచారు. వందలాది మంది ప్రజలు వేడుకలకు హాజరు అయ్యారు. అయితే ఐదు రౌండ్లు బండ్లను తిప్పిన తరువాత తాడును తెంచాలని ముందుగా సూచించినప్పటికీ రెండో రౌండ్‌లోనే తాడును తెంచారు.

❖ గండేడ్ మండలంలోని ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, రుసుంపల్లి, చిన్నవార్వాల్, రంగారెడ్డిపల్లి, పగిడ్యాల్, సల్కర్‌పేట్ గ్రామాల్లో ఏరువాక పండుగ జరుపుకున్నారు. ఉదయం రైతులు పొలాల్లో ట్రాక్టర్లు, నాగళ్లు, గుంటుకలతో పనులు ప్రారంభించారు. అనంతరం పశువులను అలంకరించి వాటిని నల్లెడ, పచ్చిపసుపు, గుడ్లు తదితర వాటిని తినబెట్టారు. సాయంత్రం వేళల్లో తోరణాల కట్టి పశువులతో ఊరేగింపుగా వెళ్లి తోరణాలు తెంపారు.

❖ మహమ్మదాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పశువులను ఎంతో అందంగా అలంకరించి పూజలు చేసి వాటికి ప్రత్యేక వంటకాలను పెట్టారు. పలు గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఏరువాక పౌర్ణమిని ఆస్వాదించారు. పంటపొలాల్లో ప్రత్యేక పూజలు చేసి పశువుల ఎరువులను సహితం పొలాల్లో వేసుకునే కార్యక్రమం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, పంటలు మంచిగా పండాలని వరుణదేవుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

❖ రాజాపూర్ మండలంలోని రాయపల్లి గ్రామంలో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. గ్రామ శివారులో ఉన్న పెద్దకుంట తూం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయసంతో నైవేద్యం పెట్టి భూమాతకు, వరుణదేవునికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోనాయో వ్యవస్థాపకులు ప్రశాంత్‌చారి, బీజేపీ నాయకులు సూరిబాబుగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఊరూరా శకటోత్సవాలు

❖ హన్వాడ మండలంలో ఆయా గ్రామాల్లోని ఆలయాల చుట్టూ శకటోత్సవ ప్రదర్శన కనుల పండువగా నిర్వహించారు. రైతులు ఎద్దుల బండ్లను ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కొందరు ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, బైక్‌లు ఆలయ ప్రదక్షిణలు చేయించారు.

❖ చిన్నచింతకుంట మండలంలో ఏరువాక తాడును తెంపేందుకు పోటీ పడ్డారు. ఏరువాక తాడును తెంపిన విజేతలకు ఎడ్ల మూగల జతలు, వెండి వంటి బహుమతులను అందజేశారు. ముచ్చింతలలో తాడు తెంపిన విజేతలకు కురుమూర్తి స్వామి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ యార్డ్ మెంబర్ తిరుత్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, మైపాల్‌రెడ్డిలు మూగల జతను అందజేశారు.



కొంరెడ్డిపల్లిలో శకటోత్సవం



పగిడ్యాల్‌లో ఏరువాక ఉత్సవాలు



వెన్నాచేడ్‌లో తోరణం తెంపుతున్న యువకులు

రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్



ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణం మ్యాపును పరిశీలించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

- ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద రూ.110 కోట్లతో మంజూరైన ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం రోడ్డు మ్యాపును పరిశీలించారు. ముందుగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కురుమూర్తి స్వామి ఆలయం వద్ద భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే భక్తుల సౌకర్యార్థ ఎలివేటెడ్ కారిడార్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేశారన్నారు. వెంటనే స్వామి వారి దర్శనానికి వచ్చి ఆలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ఘాట్‌రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మంచినీటి వసతి, కాటేజ్ నిర్మాణం, కల్యాణ మండపాలు వంటి తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తి స్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర, మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ప్రశాంత్‌కుమార్, కతలప్ప, జిల్లా ఆర్ అండ్ బీ డీఈఈ సంధ్య, ఆలయ కమిటీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు ఉన్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం

దేవరకద్ర రూరల్: నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొకుంట్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకుముందు కొకుంట్లలోని పురాతన శివాలయాన్ని దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.40 లక్షలతో దేవాదాయ శాఖ నిధుల నుంచి శివాలయ పునర్‌నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.

రాజీ కేసులను గుర్తించాలి

మహబూబ్‌నగర్ క్రైం: లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం వల్ల శాశ్వత పరిష్కారం లభిస్తోందని, రాజీ ద్వారా ఇరు పార్టీల వ్యక్తులు న్యాయం జరుగుతుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షలతో కోర్టుల చుట్టు తిరుగుతూ సమయం, డబ్బులు వృథా చేసుకోవద్దని రాజీ అయ్యే క్రిమినల్, కంపౌండబుల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబ నిర్వహణ, రోడ్డు ప్రమాదాలు, చిన్నపాటి దొంగతనాలు, వైవాహిక వివాదాలు, డ్రంకెన్‌డ్రైవ్, కాపీరైట్ అండ్ సెర్చ్, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో రాజీ చేసుకోవాలని తెలిపారు. కోర్టు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్స్, ఇతర పోలీస్ అధికారులు రాజీ అయ్యే కేసులు అన్నింటిని గుర్తించి ఇరుపక్షాలకు కౌన్సిలింగ్ ఇచ్చి రాజీ చేసుకోవడానికి సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు.

వార్డుల విభజన సరిచేయండి

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ వార్డుల విభజన అస్తవ్యస్తంగా ఉందని ఓటర్ల సమూహంతో పాటు ప్రాంతాలను ఒకే వార్డులో వచ్చేలా చూడాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు బుధవారం మున్సిపల్ అధికారి సీత్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికలు జరగక ముందే వార్డుల విభజనపై సమీక్షించి ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షులు కృష్ణంరాజు, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి దేవన్న, రాచాలరాజు పాల్గొన్నారు.

సన్నబియ్యానికి బదులు దొడ్డు రకం పంపిణీ

జడ్చర్ల: మండలంలోని నసరుల్లాబాద్ గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యానికి బదు లు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ నసరుల్లాబాద్ తండాకు చెందిన వారికి గురువారం సన్నబియ్యం ఇవ్వకుండా గతంలో మిగిలిన దొడ్డుబి య్యం పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్య లు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తాము సన్న బియ్యం మాత్రమే రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నామని, దొడ్డు బియ్యం చేయడం లేదని జడ్చర్ల స్టాకు పాయింట్ డిప్యూటీ తహసీల్దార్ బాలప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

రెండు కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: సీసీకుంట, దేవరకద్ర పోలీస్ స్టేషన్‌లలో వేర్వేరుగా నమోదైన రెండు క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో ప్రేమ వ్యవహారంలో యువకుడు గోపాల్‌పై హరిజన్ రవి, నరేశ్, గుడే గోపాల్ ముగ్గురు కలిసి దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన దేవరకద్ర పోలీసులు ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి ముగ్గురికి ఒక్కొక్కరికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. సీసీకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో పాత కక్షల నేపథ్యంలో పెద్ద లింగన్నపై కమ్మరి జగతయ్య దాడి చేశాడు. ఈ కేసులో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఛార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా బుధవారం జిల్లా మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నేరస్తుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ నేరం జరిగిన ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడటంతో పాటు బాధితులకు న్యాయం జరగాలన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మిథున్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరోసారి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం ఇచ్చినందుకు గర్వంగా భావిస్తున్నట్లు నూతన ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మరో ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు పదవి ఇచ్చినందుకు ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తామన్నారు. ఓబీసీల సంక్షేమం గురించి మాట్లాడిదే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ అని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఓబీసీల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కులగణన చేస్తామని షెడ్యూల్ విడుదల చేశారని, కానీ 2026లో నార్త్ రాష్ట్రాలు, 2027 మన ప్రాంతంలో చేస్తామనడం సరికాదన్నారు. ఈడబ్ల్యూఎస్ బిల్లును ఏ విధంగా పార్లమెంట్, రాజ్యసభలో పెట్టి త్వరితగతిన అమలు చేశారో, కులగణనను అదే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను డీసీసీ అధ్యక్ష రేసులో ఉన్నానని పేర్కొన్నారు. మరో టీపీసీసీ నూతన ప్రధాన కార్యదర్శి ఏపీ.మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఇది తనకు పదవి అని కాకుండా బాధ్యతగా రాష్ట్రం అంతటా తిరిగి పార్టీని బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం వారిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. సమావేశంలో నాయకులు సిరాజ్‌ఖాద్రీ, బెనహర్, జహీర్ అఖ్తర్, షబ్బీర్ అహ్మద్, సుభాష్‌ఖత్రి, అజ్మత్‌అలీ, సాయిబాబా, రాములు యాదవ్, ఫయాజ్, మక్సూద్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'లో సమస్యలు పరిష్కారం



చిన్నచింతకుంటలో ఫిర్యాదులు తీసుకుంటున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దేవరకద్ర: భూ భారతి రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లో ఉండే భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం దేవరకద్ర మండలం మీనుగోనిపల్లి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలు కూడా భూ భారతి రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సదస్సులో 92 ఫిర్యాదులు..

దేవరకద్ర మండలం మీనుగోనిపల్లి, గూరకొండ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు.

❖ చిన్నచింతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఆర్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

సదస్సులు వినియోగించుకోవాలి

అడ్డాకుల: భూముల సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ శేఖర్ సూచించారు. మండలంలోని పొన్నకల్ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై 64 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్ బిన్ ఇక్బాల్, గిర్దావర్లు సృజన్, శశికిరణ్ ఉన్నారు.

నవాబుపేటలో 33 దరఖాస్తులు

నవాబుపేట: మండలంలో రెవెన్యూ గ్రామ సభలో 33 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కారుకొండ, హన్మసానిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించగా, కారుకొండలో 21, హన్మసానిపల్లిలో 11 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీటీ సువర్ణ, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు సాగాలి

- సీపీఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మిక, ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు సాగాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి తెలిపారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. నిరుద్యోగం, ఆకలి, దరిద్రం పెరుగుతున్నాయని, కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మాత్రం 11 ఏళ్ల పాలన స్వర్ణయుగమని చెప్పడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు ప్రయత్నిందని, దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా తప్పించుకునే మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా నాయకులు కిల్లెగోపాల్, రాంరెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి, మునిమోక్షం లక్ష్మయ్య, రాజ్‌కుమార్, వరద గాలెన్న, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మమాట అంగన్‌వాడీ బాట'



క్రిస్టియన్‌పల్లిలో చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డిస్తున్న బెనహర్



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవన్న

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం-3 లో బుధవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం కృషి చేస్తున్నట్లు తె లిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన ఆహారంతో పాటు విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రీస్కూల్‌లో భాగంగా చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు సీబీ.శ్రీపూజిత, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

గండేడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ దేవన్న తెలిపారు. గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్‌బిర్యానీ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రామేశ్వరమ్మ, బుచ్చమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

చిన్నారుల బడికి సెల్ఫీ వెల్‌కం..

నవాబుపేట: నేడు విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో బడికి వచ్చే వారికి చిన్నారులే ప్రత్యేకంగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పోమాల్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సెల్ఫీతో వెల్‌కం పలికేలా ప్రత్యేక స్టాండును ఏర్పాటు చేశారు. కారూర్ గ్రామంలో సైతం సెల్ఫీ బోర్డును ఏర్పాటు చేయటం ప్రత్యేకం. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రానికి రంగులతో అందంగా తీర్చిదిద్దారు.

భూత్పూర్: చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ ప్రభాకర్ అన్నారు. మండలంలోని పాత మొల్గరలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మధ్యాహ్న భోజనంలో ఎగ్‌బిర్యానీ డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్‌ఐ బాలసుబ్రమణ్యంతో కలిసి ఎంపీడీఓ ప్రారంభించారు.

యూజీడీ పనుల పరిశీలన



శివశక్తినగర్‌లో యూజీడీ పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శివశక్తినగర్, జిల్లా జైలు ప్రాంతంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులను బుధవారం టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫహీం, ఎల్లంగారి భరత్, అనిత, ముక్రంషా, పాతూర్ కుమార్, కుర్వ నరేష్, రవి, షకీల్ పుట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.